# అంతర్మథనం

**కె. సునంద**




"బ్రతుకు బుగ్గి చేసిన సారా" కథల పోటీలో ఈ వారం ఎన్నికయిన కథ

**దీపం కొడిగడుతున్నట్లుంది. ఒత్తి సరిచేసి కొద్దిగా నూనె పోసింది. నూనె యింకొంచమే మిగిలివుంది.** తెల్లారడానికింకా చాలా సమయముంది. మరి అప్పటిదాక ఆ కాస్త నూనె సరిపోతుందా? అన్నట్లు తెల్లవారిన తరువాత కూడా తలదగ్గర దీపముండాల్సిందే కదా. మరి దహనక్రియలకు డబ్బు? లేచి యిల్లంతా కలయచూసింది. డబ్బు పుట్టించగల వస్తువేమయినా మిగిలివుందా అని. అలాంటివేమీ వుండవు. కాదు. లేవని తెలుసు. అలాంటివొక్కొక్కటిగా నడకలు, పరుగులు నేర్చి, అమాంతంగా ఎగిరి మాయమయిపోయాయి. అన్నీ రూపంతరం చెంది సారాగా మారి అతని గొంతులోకి జారి, కడుపులో చేరి, దాన్ని చిందర వందర చేసి చీల్చుకుని బయటకు వెళ్ళిపోయాయి. మిగిలిన కొద్దోగొప్పో సామాను సారా చేసిన గాయాలకు, రోగాలకు హారతి కర్పూర మయిపోయాయి. మందులు పనిచేసే స్థితిని దాటి చాలాకాలమయ్యింది. ఏది జరగాల్సి వుందో అది త్వరగా జరిగితే బాగుండుననే స్థితికి ఆమె చేరి ఆరాటంగా ఎదురు చూడసాగింది.

వారం దినాలుగా ఒకటే విరోచనాల తనిఖీ. ధర్మాసుపత్రిలో చేర్పించింది. తిండేలేదు కొన్నాళ్ళుగా, మరి ఎక్కడ నుండి వస్తోందో అంత వాసన. ఇన్నేళ్ళుగా తాగిన సారా కూడా అతని శరీరంలో యిమడలేక యీ రూపంలో బయటపడుతోందేమో. అది తీసికెళ్ళి బయట పడేసొచ్చేసరికి ఆమెకు వాంతి. ఆమెకూ తిండి లేదు మరి కొన్నాళ్ళుగా. నీచుకంపు కొట్టే నీళ్ళొచ్చేవి. తల గిర్రున తిరుగుతుండగా ఎట్లో వచ్చి మంచం ప్రక్కన కూలబడి, శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. ఎవరో పోయినట్లున్నారు. గొల్లుమని ఏడుపులు. ఇక్కడ లాంటివేవీ... అదే గొల్లుమనడాలు లాంటివి జరగవు. అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంది. ఇదేమిట నిజంగానే నిశ్శబ్దంగా వుంది.

అంటే..అంటే... ఊపిరాగిపోయిందా. అచ్చంగా శవంలాగా పడివున్నాడు. ముక్కు దగ్గర వేలు పెట్టింది. కొనవూపిరి.

ఆమె బాగా విసిగిపోయివుంది. ఆమె విముక్తికోసం ఎదురుచూస్తోంది. పోనీ తనకు చావొచ్చినా ఫరవాలేదు. వద్దనే వాళ్ళకొస్తుంది చావు. ఆఖరుకు చావుకు కూడా తన మీద దయలేదా? కాని ఇప్పుడెదురు చూస్తున్నంత ఆబగా యిదివరకెప్పుడూ ఎదురు చూడలేదు.

మొదటిసారి చావునెప్పుడు కోరుకొంది? అతను తప్పతాగి తూలుతూ వచ్చి తన సారా కంపు నోటిని తన నోట్లో పెట్టి ముద్దులాడినప్పుడు. అతడు భళ్ళున వాంతి చేసికొంటే ఆ వాంతి ఎత్తిపోస్తున్నప్పుడు రోతపుట్టి అటువంటి బ్రతుకు బ్రతికే కంటే చావడమే నయమనిపించింది. కాని ఆశ్చర్యం. అన్నీ అలవాటయిపోయి దైనందిన కార్యక్రమాలయ్యాయి.

పెళ్ళయి ఎన్నేళ్ళయినా పిల్లాపాపా కలగలేదని తనను నానా మాటలన్నారు. పురిటిబిడ్డ బొడ్డు తినిపించడంలాంటి మురికి పనులు చేయించారు. బోసి నవ్వుల పాపాయొకటి తనకు తోడుంటే ఎంతటి కష్టమయినా భరించొచ్చుకదా అని అన్నీ ఒప్పుకొంది. అతని ఒంట్లో సారా తప్ప యింకేమీ లేదని, బిడ్డలనిచ్చే శక్తి నిర్వీర్యమైపోయిందని తెలిసిన నాడు డెడ్ ఎండ్‌లాంటి ఆ జీవితం కంటే యిప్పుడే చస్తే మేలనిపించి చావు నాహ్వానించింది.

తాగుడెక్కువయి డ్యూటీ సక్రమంగా చేయడంలేదని అతన్ని ఉద్యోగం నుండి వూడబెరికిన నాడు రాబోయే దినాలు



**వసంతం!**

**పచ్చదనాల**
**పత్రహరితం**
**పెంచు! నీ మంచిని కోరుకుంది!**
**కొంగలు కోనల్లో**
**కోయిలమ్మల్ని బ్రతకనీ**
**నీకు కుహు కుహు గీతాల్తో**
**సంగీత సరిగమలు అందిస్తాయి!**
**కొమ్మ కొమ్మన రంగుల పూలు**
**పూయనీ**
**వికసిత హరివిల్లులు నీకు**
**గుభాళింపుల గుసగుసలు**
**అందిస్తాయి!**
**వసంతమొక చైతన్యం**
**వసంతమొక వూపిరి**
**వసంతం నా జీవిత భాగం!!**

**- జి.జి.కె.రావు**

తలుచుకొని వణికిపోయింది. దేముడి ముందు పెట్టిన దీపపు సెమ్మెలోని వత్తులు పిండి, ఆ నూనెతో తిరగమోత పెట్టినప్పుడు ఏమిటీ దరిద్రపు బ్రతుకు. చావెందుకు రాదు అని ఆక్రోశించింది.

మొదటిసారి అప్పులవాళ్ళొచ్చి యింటి ముందు నిలబడి బూతులు తిడుతూ వుంటే, సిగ్గుతో చచ్చిపోయింది. అప్పులాళ్ళొస్తారని ఎట్లాగ పసిగట్టేవాడో కనబడకుండ మాయమయిపోయేవాడు. అతడు పక్కా తాగుబోతు కదా. అప్పులెట్లా యిచ్చే వాళ్ళో. ఇంట్లో భార్య ఒంటిమీద కాస్తో కూస్తో బంగారముండక పోతుందా అని ఆశపడ్డారేమో అమాయకులు.




ఒకసారి అప్పులవాడొకడు అర్ధరాత్రిదాక కాపు కాసాడు. ఆ రాత్రి ఆ మర్నాడు కూడ మనిషి పత్తాలేడు. తెల్లవారు ఝామున పిల్లిగా వచ్చి మెల్లగా తట్టాడు. తనకసలు నిద్రపడితే కదా. రాత్రికి రాత్రే పరారయిపోయారు. తలుపు తీసిన తోడికోడలు చూసిన చూపు గుండెల్లో గుచ్చుకొని అవమానంతో చచ్చిపోయింది. రైలెక్కి వచ్చే బదులు రైలు కింద బడివుంటే... గుప్పెడు మెతుకులు తిని బండెడు చాకిరి చేసి పెట్టింది. వాళ్ళింటికెదురుగా వున్న గుళ్ళో వూడ్చి శుభ్రం చేస్తే పులిహోర, పెరుగన్నం దొరికేది. తన్నొదిలేసి ఒకటి, రెండు నెలలు పత్తాలేకుండా పోయేవాడు. ఇక అప్పటినుండి ఈ పద్ధతే బాగుందనిపించిందేమో. ఒక్కొక్కళ్ళింట్లో రెండు, మూడు నెలలుంచేసేవాడు. మధ్యలో తప్పని సరిగా తమవూరికి వెళ్ళినా ఏ రెండు మూడు దినాలో వుండేవాళ్ళు. పగలంతా తననింట్లో పెట్టి తాళం వేసి వెళ్ళేవాడు. మూసిన ఆ గదిలో తాను సజీవ సమాధి అయిపోతే ఎంత బాగుండును.

అతడి చెల్లెలు ఒకప్పుడు తననెంత అపురూపంగా చూసికొనేది. గారాలుపోతూ అన్నీ కొనిపించుకొనేది అన్ననడిగి. ఇప్పుడెట్లాగ ఈసడించుకొంటూవుందో. ఒక్కొక్క మాట గునపాల్లా గుచ్చుకొంటూ వుంటే భూమి ఎందుకు చీలి తనను లాక్కోవడం లేదా అని పరితపించింది. అన్నీ తననొదిలేసినా సిగ్గూ, బిడియం, అభిమానమెందుకో తననొదలట్లేదు. తన అక్కలింటికి వెళ్ళినప్పుడు వాళ్ళేమీ అనకపోయినా తనకెందుకో వూపిరాడనట్లుండేది. భరించినన్నాళ్ళు భరించి ఓపిక నశించగానే చార్జీలకు, ఖర్చులకు డబ్బిచ్చి పంపించి వేసేవాళ్ళు. ఎన్నాళ్ళు భరించగలరెవరయినా. అదీ తన్నుకొని పోయేవాడు. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. అందులో కల. తప్పతాగి వచ్చిన అతడు జుట్టుపట్టుకొని ఈడ్చుకొని పోతున్నాడు. విదిలించుకొంది. ఠపీమని తలకేదో కొట్టుకుంది. అబ్బా! అని లేచింది. అతడు చచ్చిపోలేదా? గాభరాగా చూసింది. భయం లేదు. చచ్చిపడివున్నాడు. తన తలకు తగిలింది యింట్లో మిగిలివున్న ఒకే ఒక వస్తువు. ఇనపమంచం. మెల్లగా అతి మెల్లగా ఆమె పెదవులు విచ్చుకున్నాయి. ❋

**ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.**
**- ఎడిటర్**